సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం ; 25 ; ఏప్రిల్ ; 2025



వరప్రదాయిని కోయిల్‌సాగర్

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పంప్‌హౌజ్ నుంచి రోజూ తాగునీటిని సరఫరా చేయనున్నారు.

వివరాలు 10లో ▸



పనులు వేగవంతం

జోగుళాంబ రైల్వే హాల్ట్ పనులను వేగవంతం చేయాలని జీఎం జైన్ అన్నారు.

వివరాలు 10లో ▸



వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కొనుగోళ్లు పారదర్శకంగా ఉండాలి



ధరూరు: ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియా నాయక్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల మహిళా సమాఖ్య సభ్యులతో మాట్లాడి కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేయాలని, మ్యాచర్ మిషన్ ఆధారంగా వచ్చిన తేమ వివరాలను తీసుకుని ధాన్యం సేకరించాలని మండల అధికారి శ్రీలత, ఐకేపీ అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి తీసుకునే ఆధార్, పట్టాదార్ పాస్ బుక్, అకౌంట్ నంబర్ల జిరాక్స్ కాపీలను సరిచూసుకుని ధాన్యం సేకరించాలన్నారు.

సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలి

గద్వాల క్రైం: పోలీసుస్టేషన్ పరిధిలో సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాల్సిందిగా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం వివిధ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యలతో వచ్చిన బాధితులకు స్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుల్స్ మాట్లాడి వాటిని పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కోర్టు కేసుల విషయంలో నిర్లక్ష్యం లేకుండా ముందుకెళ్లాలని సూచించారు. సమావేశంలో సీసీఎస్ సీఐ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,339

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 299 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6339, కనిష్టం రూ. 3099, సరాసరి రూ. 5699 ధరలు పలికాయి. 6 క్వింటాళ్ల కంది రాగా గరిష్టం రూ 6300, కనిష్టం రూ 5869. సరాసరి రూ. 6308 ధరలు వచ్చాయి. 94 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5921, కనిష్టం రూ. 4607, సరాసరి రూ. 5921 ధరలు పలికాయి. 1665 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.1980, కనిష్టం రూ. 1709, సరాసరి రూ.1960 ధరలు లభించాయి.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,271

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి మార్కెట్ యార్డులో గురువారం మొక్కజొన్నకు క్వింటాల్ గరిష్టంగా రూ.2,271, కనిష్టంగా రూ.1,409 ధరలు లభించాయి. వేరుశనగ గరిష్టంగా రూ.6,191, కనిష్టంగా రూ.4,000, ఆముదాలు గరిష్టంగా రూ.6,510, కనిష్టంగా రూ.5,841, జొన్నలు గరిష్టంగా రూ.4,355, కనిష్టంగా రూ.3,627, కందులు రూ.6,480, ధాన్యం హంస రూ.1,869, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.2,359, కనిష్టంగా రూ.1,802, రాజేంద్ర రకం రూ.1,916 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ ధాన్యం గరిష్టంగా రూ.,2212, కనిష్టంగా రూ.1,806, హంస ధాన్యం గరిష్టంగా రూ.1,769, కనిష్టంగా రూ.1,639, ఆముదాల గరిష్టంగా రూ.5950గా ఒకే ధర నమోదైంది.

నేడు డయల్ యువర్ ఏటీఎం లాజిస్టిక్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ లాజిస్టిక్ సమస్యల కోసం శుక్రవారం డయల్ యువర్ ఏటీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇసాక్ బిన్ మహ్మద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ కార్గో సంబంధిత సమస్యలను 8125456978 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రామన్‌పాడులో 1,015 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో గురువారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,015 అడుగులు ఉందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. దీంతో జలాశయంలోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 2 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వల నుంచి 18, తాగునీటికి 20 క్యూసెక్కుల నీటిని వదిలారు.

జూరాల.. భద్రమేనా?

జూరాల జలాశయంలో తెగిన 8 గేట్ల ఇనుప రోపులు



- 18 చోట్ల రబ్బర్‌సీల్ దెబ్బతినడంతో లీకేజీలు
- మరమ్మతు నేపథ్యంలో నిలిచిన గ్యాంట్రీక్రేన్ సేవలు
- మూడేళ్లుగా 50 శాతం కూడా పూర్తికాని రిపేర్లు
- ఆందోళన కలిగిస్తోన్న అధికార యంత్రాంగం, పాలకుల వైఖరి

గద్వాల: ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయినిగా పేరుగాంచిన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రమేనా..? 2009 సంవత్సరం మాదిరిగా మరోసారి వరద పోటెత్తితే ప్రాజెక్టు తట్టుకుంటుందా? అంటే.. ప్రాజెక్టులోని తెగిన గేట్ల రోప్‌లు, ధ్వంసమైన రబ్బర్ సీల్ నిర్మాణాలను చూస్తే నిస్సందేహంగా లేదనే మాటే వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని భీమా, నెట్టెంపాడు, పాలమూరు– రంగారెడ్డి, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులకు సాగునీరందిస్తూ.. కీలకపాత్ర పోషిస్తున్న పెద్దన్నకు పెనుముప్పు తరుముకొస్తే.. అన్న ఆలోచన కూడా వెన్నులో వణుకు పుట్టిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా పాలమూరుకు సాగు, తాగు నీరందిస్తున్న ప్రాజెక్టును.. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అధికార యంత్రాంగం, పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడం ఆందోళన కలిగిస్తుంది.

62 రేడియల్ క్రస్ట్ గేట్లు..

జూరాల ప్రాజెక్టుకు మొత్తం 62 రేడియల్ క్రస్ట్ గేట్లు, 84 బ్లాకులు ఉన్నాయి. ప్రాజెక్టుకు వరద వచ్చినప్పుడు ఈ 62 రేడియల్ క్రస్ట్ గేట్లను ఆపరేట్(పైకెత్తడం) చేయడం ద్వారా నీటిని దిగువనకు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో రేడియల్ క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేశారు. అర్ధ చంద్రాకారంలో ఉన్న గేట్లను పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు గేట్లకు ఇరువైపులా రెండు రబ్బర్ సీల్స్, అడుగు భాగాన ఒక రబ్బర్ సీల్ ఉన్నాయి. ఆపరేట్ చేసేందుకు అవసరమైన ఇనుప రోప్‌లు గేటుకు ఇరువైపులా, కింది భాగాన రెండు చొప్పున ఇనుప రోపుల నిర్మాణం ఉంటాయి. వీటి సాయంతోనే మొత్తం రేడియల్ క్రస్ట్ గేట్లను అవసరమైనప్పుడు పైకి ఎత్తడం, దించడం చేస్తారు.

భారీ వరద వస్తే..

2009 సంవత్సరం మాదిరి జూరాలకు భారీ వరద వస్తే దెబ్బతిన్న గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. ఇటీవల కర్ణాటకలోని టీబీ డ్యాం గేటు కొట్టుకుపోవడం, తాజాగా విజయవాడలోని కృష్ణా బ్యారేజీ గేట్లు దెబ్బతినడం ఘటనలే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడి మొత్తం గేట్లను పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి భారీ వరదలు వచ్చినా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టు..

కృష్ణాబేసిన్ పరిధిలో రాష్ట్రంలోనే తొలి ప్రాజెక్టుగా ఇందిరా ప్రియదర్శిని జూరాలను 1981లో రూ.550 కోట్లతో నిర్మించారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. దీని కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కుడి కాల్వ పరిధిలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో 37,700 ఎకరాలు, కుడి కాల్వ పరిధిలో ఆత్మకూరు, వనపర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో 63,500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తోంది.

జూలై నాటికి పూర్తి..

జూరాల ప్రాజెక్టు క్రస్ట్ గేట్లకు మరమ్మతు చేసేందుకు మూడేళ్ల కిందట రూ.11 కోట్ల నిధులు వచ్చాయి. అయితే 2022లో పనులు కొంతమేర వేగవంతంగా జరిగాయి. కానీ, 2023లో గ్యాంట్రీక్రేన్‌కు సమస్య తలెత్తడంతో పనులకు అడ్డంకిగా మారింది. ప్రస్తుతం గ్యాంట్రీక్రేన్‌ను పూర్తిస్థాయిలో రిపేరు చేశాం. శుక్రవారం నుంచి పనులు వేగవంతం చేసి జూలై నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. – జుబేర్, ఈఈ జూరాల డ్యాం

రిపేర్లతో లీకేజీలు..

ప్రాజెక్టు మొత్తం 62 గేట్లలో 18 గేట్ల నుంచి ఏడాదిగా నీరు లీకేజీ అవుతోంది. ప్రధానంగా గేట్లు దెబ్బతినకుండా, రాపిడికి గురికాకుండా రక్షణ కల్పించే రబ్బర్ సీల్ పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే గేట్లను పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు సహాయపడుతున్న ఇనుప రోప్‌లు పూర్తిగా దెబ్బతిని 8 గేట్లను ఆపరేటింగ్ చేయలేకపోతున్నారు. ఈ సమస్యను గుర్తించిన అధికారులు మొత్తం 62 గేట్లు మొదలుకొని రబ్బర్ సీల్స్, రోప్స్, పెయింటింగ్, సాండ్ బ్లాస్టింగ్, గేట్ల స్ట్రెంథనింగ్ వంటివి మరమ్మతు చేసేందుకు మూడేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం ఒప్పందం గడువు ముగిసి.. మరోసారి పొడిగించిన గడువు ముగిసిపోయినా పట్టుమని 50 శాతం పనులు కూడా పూర్తి చేయలేకపోయారు.

■ ప్రస్తుతం డ్యాం పైభాగాన ఉన్న హాయిస్ట్ బ్రిడ్జి, గేట్ల వద్ద ఉన్న వాక్‌వే బ్రిడ్జికి సంబంధించి సాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తి చేయగా.. మిగిలిన పనులు కొనసాగుతున్నాయి.



రబ్బర్ సీల్ దెబ్బతినడంతో గేటు ద్వారా లీకేజీ అవుతున్న నీరు

భూభారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం



మల్దకల్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

మల్దకల్: ఎంతో కాలంగా భూసమస్యలతో ఇబ్బంది **పడుతున్న రైతులకు భూభారతి చట్టం** ద్వారా **సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్** బీఎం సంతోష్ రైతులకు సూచించారు. గురువారం మల్దకల్‌లో భూభారతి చట్టంపై అవగాహన సమావేశం నిర్వహించగా.. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ధరణిలో ఉన్న చిన్న చిన్న పొరపాట్ల కారణంగా రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం కొత్తగా వచ్చిన భూభారతిలో ధరణిలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రత్యేక చట్టం చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. రైతులు భూసమస్యలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే పరిష్కరించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగ పరచుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కారం కానీ సమస్యలు ఆర్డీఓ కార్యాలయంలో పరిష్కరించబడతాయన్నారు. భూభారతి ద్వారా తక్షణ రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వే నంబరు, వ్యవసాయ భూమికి సంబంధించిన నక్ష ఉంటుందన్నారు. అదే విధంగా వారసత్వ భూములు, పెండింగ్ సాదా బైనామాల దరఖాస్తులను పరిష్కరించవచ్చన్నారు. మనిషికి ఆధార్‌కార్డు లాగే భూమికి భూదార్ సంఖ్యను కేటాయింపు చేస్తారని, భూ అక్రమాలకు అవకాశం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకుంటుందని, అలాగే గ్రామాలలో ప్రజలకు భూభారతి చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు లక్ష్మీనారాయణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ షాహేదాబేగం, ఏఓ రాజశేఖర్, డిటీ ఝాన్సీరాణి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమానికి హాజరైన రైతులు

'ఉపాధి' కూలీలకు అధిక వేతనం వచ్చేలా చూడాలి



ధర్మవరంలో పనులు చేస్తున్న వద్ద రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

ఎర్రవల్లి/ఇటిక్యాల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలతో సరైన కొలతల ప్రకారం పనులను చేయించి అధిక వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులకు సూచించారు. గురువారం ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లో పలు చోట్ల జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంత రైతుల యొక్క రవాణా సౌకర్యాల మెరుగుదలకు అవసరమయ్యే పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో కనీస వసతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు అబ్దుల్ సయ్యద్‌ఖాన్, అజార్ మెహియుద్దీన్, టిఎలు కృష్ణ, పురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి



సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు సంఘీభావం తెలుపుతున్న విద్యార్థులు

గద్వాలటౌన్: యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె 6వ రోజుకు చేరుకుంది. గురువారం గద్వాల ప్రభుత్వ పీజీ సెంటర్‌లోని కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన సమ్మెకు పలు విద్యార్థి సంఘాల నాయకులు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 21 వల్ల కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపకుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, పార్ట్ టైం అధ్యాపకులకి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు మంగళగిరి శ్రీనివాసులు, మహేందర్, గోపీనాథ్‌రాథోడ్, వంగూరి గణేష్‌లతో పాటు విద్యార్థి నాయకులు భాస్కర్, నవీన్‌కుమార్, శ్రీనునాయక్, కోటి, బలిచక్రవర్తి, మమత, స్పందన, శ్యామల, నిఖిత, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



జైబాపు, జైభీం, సంవిధాన్ పాదయాత్రలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల తదితరులు


పెంట్లవెల్లి: కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండలంలోని జటప్రోల్, గోప్లాపూర్ గ్రామాల్లో కొనసాగిన సంవిధాన్ పాదయాత్రలో మంత్రి జూపల్లి కృష్ణారావుతోపాటు రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో మంది నేతలు మన దేశం కనుమరుగు కాకూడదని ఎన్నో త్యాగాలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది అన్నారు. కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేయాలని కొందరు చూస్తున్నారని, ప్రజలు దీనిని ఎప్పటికీ సహించరన్నారు. బీఆర్ అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని అందించిన గొప్ప మహనేత అని, ఈ రోజు మనం ఇలా ఉన్నామంటే ఆ మహనీయుల కృషి ఫలితమే అన్నారు. ప్రతిఒక్కరూ మహనీయుల అడుగు జాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మండలంలోని జటప్రోల్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు, చైర్‌పర్సన్ వెన్నెల ప్రారంభించారు. కార్యక్రమంలో గోవింద్‌గౌడ్, రామన్‌గౌడ్, భీంరెడ్డి, గోపాల్, ఖదీర్, కుమార్ పాల్గొన్నారు.

నేడు రజతోత్సవ సన్నాహక సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సన్నాహ సమావేశం శుక్రవారం న్యూటౌన్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కవిత ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. బీఆర్ఎస్ పార్టీ సభ విజయవంతం చేయడం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె దిశా నిర్దేశం చేయనున్నారు. కార్యక్రమానికి ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

'రియల్' మోసాలు..

- నడిగడ్డలో స్కీంల పేరిట యథేచ్ఛగా దందా
- కాలపరిమితి ముగిసినా స్థలాలు రిజిస్ట్రేషన్ చేయని వైనం
- రీ క్రియేషనల్ స్థలంలోనూ వెంచర్లు ఏర్పాటు
- లబోదిబోమంటున్న బాధితులు
- నాలుగు నెలల్లో 93 ఫిర్యాదులు



గద్వాల క్రైం: సొంతిల్లు నిర్మించుకోవాలనేది ప్రతిఒక్కరి కల. దీనిని అవకాశంగా మార్చుకున్న కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు అమాయక ప్రజలే లక్ష్యంగా కొత్త కొత్త స్కీంల పేరిట దందా నిర్వహిస్తూ ప్రజలను నట్టేట ముంచుతున్నారు. ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరకు స్థలాలు ఇస్తామంటూ స్కీంల పేరిట వాయిదాల రూపంలో డబ్బులు వసూలు చేసి ఏళ్లు గడుస్తున్నా స్థలాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారు. వారి కబంధ హస్తాల్లో చిక్కుకుని న్యాయం కోసం బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని పార్కులు, విశ్రాంతి స్థలాల ఏర్పాటుకు కేటాయించిన రీ క్రియేషన్ స్థలాలు సైతం కబ్జా చేసి వీటిని కూడా వెంచర్లుగా చేసి ప్రభుత్వ ఆస్తులను సొంతం చేసుకునే కుట్రలకు పాల్పడుతున్నారు.

జిల్లాలో ఇటీవల వచ్చిన ఫిర్యాదులు..

■ 3.02.2025 తేదీన గద్వాల పట్టణానికి చెందిన ఓ రిటైర్డు ప్రొఫెసర్ 2000 సంవత్సరం నుంచి 2003 వరకు ఓం సాయి ప్రియ రియల్ ఏస్టేట్‌లో స్కీం పేరిట నెల వారిగా డబ్బులు చెల్లించాడు. వెంచర్‌లో సభ్యుడుగా కాలపరిమితి స్కీం డబ్బులు చెల్లించాడు. అయితే సదరు రియల్ ఏస్టేట్ వ్యాపారులు మాత్రం ఆ ఉద్యోగికి స్థలం రిజిస్ట్రేషన్ చేయలేదు. దీనిపై పలు మార్లు పంచాయితీలు చోటు చేసుకున్నాయి. నేడు రేపు అంటూ సాగదీశారు. మోసపోయినట్లు గుర్తించి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించాడు.

■ 14.02.2025 తేదీన గట్టు మండలానికి చెందిన ఓకే కుటుంబానికి చెందిన ఏడుగురు తాము పూర్తిగా స్కీం డబ్బులు చెల్లించినా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయడం లేదంటూ పోలీసులను ఆశ్రయించారు. వీరికి రియల్ ఏస్టేట్ వ్యాపారి స్వయాన బంధువు కావడంతో ముబారక్ నైస్ రియల్ ఏస్టేట్‌లో 2013 నుంచి 2018 వరకు స్కీంలో ప్లాట్ కోసం డబ్బులు చెల్లించారు. కాలపరిమితి ముగియగా వారికి ఇవ్వాల్సిన ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించాల్సిందిగా రియల్ ఎస్టేట్ సభ్యులను కోరారు. త్వరలో రిజిస్ట్రేషన్ చేయిస్తామని నమ్మించారు. నేటికీ ఎలాంటి పురోగతి రాలేదు.

■ 19.03.2025 తేదీన అయిజకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి న్యాయం చేయాలని పోలీసులను సంప్రదించారు. ఈయన అగ్రిగోల్డ్ రియల్ ఏస్టేట్‌లో 2012లో స్కీంలో ప్లాట్ కోసం డబ్బులు చెల్లించాడు. అయితే కాలపరిమితి ముగిసిన క్రమంలో ఆ సంస్థ నిర్వాహకులు బోర్డు తీప్పేయడంతో అయోమయంలో పడ్డాడు.

■ 23.01.2025 తేదీన ఇటిక్యాల మండలానికి చెందిన ప్రైవేటు వ్యాపారులు సలీం, కలీం పోలీసులను ఆశ్రయించారు. వీరు ప్లాట్ల స్కీంలో భాగంగా 2014లో డబ్బులు చెల్లించారు. అయితే కాలపరిమితి ముగిసినా సదరు వ్యాపారులు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతూ వచ్చారు. నేటికి స్థలం రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో చివరికి వారు పోలీసులను ఆశ్రయించారు. ఇలా గద్వాల – అలంపూర్ సెగ్మెంట్‌లలో గడచిన నాలుగు నెలల వ్యవధిలోనే 93 ఫిర్యాదులు పోలీసులకు వచ్చాయి. ఈ ఫిర్యాదులు సైతం జిల్లా పోలీసుశాఖ నిర్వహించిన ప్రజావాణిలో అందాయి. రెక్కలు ముక్కలు చేసుకొని వచ్చిన డబ్బును నెల నెలా చెల్లించామని, తీరా ఇన్నాళ్లకు స్థలం రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వమంటే నేడు రేపు అంటూ తిప్పుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని జిల్లా అధికారులను బాధితులు కోరుతున్నారు.



పోలీస్ గ్రీవెన్స్‌లో రియల్ ఏస్టేట్ వ్యాపారుల మోసంపై ఎస్పీకి వివరిస్తున్న బాధితులు (ఫైల్)

ప్రభుత్వ స్థలాలు కబ్జా..

గద్వాల జిల్లా కేంద్రంలో పార్కులు, విశ్రాంతి లేదా వినోదాల కోసం (రీ క్రియేషన్) కేటాయించిన భూములను సైతం రియల్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వే నంబర్లలో 57, 103, 413, 414, 415, 416, 419, 421, 422, 423, 424, 425, 426, 427, 431, 460 –494 వరకు, 671, 691, 707, 710,723, 745, 749, 758, 803, 906, 1091, 1090, 1039, 1079, 1031, 1035, 995,994, 993, 991 తదితర సర్వే నంబర్లలో 100 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఇందుల్లో పార్కులు, క్రీడా మైదానాలు, క్యాంపసైట్‌లు, హైకింగ్, క్యాంపింగ్, ఈత కొలనులు తదితర వాటి కోసం భూములు కేటాయిస్తే వీటిని సైతం రియల్ ఏస్టేట్ వ్యాపారులు వెంచర్లుగా మార్చేశారు. ఈమేరకు పలువురు ఫిర్యాదులు సైతం చేశారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

జిల్లాలో పలు రియల్ ఏస్టేట్ వ్యాపారులపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు వస్తున్నాయి. మోసం చేసిన వ్యక్తులపై వివిధ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఎవరైన వెంచర్ ఏర్పాటు చేస్తున్న క్రమంలో ప్రభుత్వ అనుమతి పొంది ఉండాలి. వెంచర్ అనుమతుల విషయంలో రెవెన్యూ, నగరపాలక, గ్రామీణ స్థాయిలో పంచాయతీ అధికారులు ధృవీకరించాలి. మొత్తం డబ్బు చెల్లించినా ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయకున్నా.. ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసి వెంచర్లు వేసినా వారిపై చీటింగ్ కేసులు నమోదు చేస్తాం.

– శ్రీనివాసరావు, ఎస్పీ

క్లుప్తంగా

నీటి గుంతలో పడి మహిళ మృతి


లక్ష్మమ్మ (ఫైల్)

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన జుంపాల లక్ష్మమ్మ (55) పాటు కాల్వ నీటి గుంతలో పడి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. లక్ష్మమ్మ తోటి కూలీలతో కలిసి బుధవారం ఉపాధి పనులకు బయలుదేరింది. మార్గమధ్యంలో ప్రమాదవశాత్తు పాటు కాల్వ గుంతలో పడిపోయింది. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికారు. గురువారం కాల్వలో మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. లక్ష్మమ్మకు భర్త వెంకటయ్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

పూడూరులో వృద్ధురాలు..

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని పూడూరుకు చెందిన బోయ రత్నమ్మ (75) బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వాకాబు చేసినా ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం కృష్ణ అగ్రహారం సమీపంలోని కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి బలవన్మరణం

ఉండవెల్లి: మండలంలోని బొంకూరుకు చెందిన కుర్వ మధు (34) పురుగు మందు తాగి కర్నూలు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన మధు బుధవారం రాత్రి పొలం వద్ద పురుగుమందు తాగి రాముడుకు ఫోన్ చేశాడు. తాతాల ఆస్తి దక్కడం లేదని.. అందుకు పొలం వద్ద పురుగు మందు తాగానని చెప్పాడు. దీంతో రాముడు ఘటన స్థలానికి చేరుకొని చూడగా అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

కుళ్లిన మృతదేహం లభ్యం

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఓ ఇంటిపై ఓ యువకుడి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైనట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన షేక్‌బాలీ కుమారుడు ముస్తాక్ (37) మానసిక స్థితి బాగోలేక మద్యానికి బానిసై రోజుల తరబడి ఇంటికి దూరంగా ఉండేవాడు. కొన్నాళ్లుగా ఇంటికి కొంతదూరంలో నిర్మాణంలో ఉన్న ఇంటిపై రాత్రిళ్లు పడుకుంటుండేవాడు. గురువారం సాయంత్రం ఓ కుక్క మనిషి చేతిని నోట కరుచుకొని గ్రామంలోని ప్రధాన రహదారిపైకి వచ్చింది. గుర్తించిన స్థానికులు చుట్టుపక్కల వెదకగా.. ఇంటిపై కుళ్లిన స్థితిలో మృతదేహం కనిపించగా ముస్తాక్‌గా గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కుటుంబ సభ్యులతో వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అక్కడి నుంచి తీసేసే ప్రక్రియ చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

వ్యక్తి హఠాన్మరణం.. కేసు నమోదు

రాజాపూర్ (బాలానగర్): పొట్టకూటి కోసం వచ్చి కూలీ పనులు చేసే ఓ వ్యక్తి హఠాత్తుగా మృతిచెందిన ఘటన గురువారం బాలానగర్ మండలం నేలబండతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ కథనం మేరకు.. ఒడిస్సా రాష్ట్రం అతిబంధ చర్యాలనుపాడకు చెందిన త్రినాథబోయి (55) 5 నెలల కిందట నేలబండతండాలో రామావత్ రాజు దగ్గర ఇటుకబట్టిలో పనిచేసేందుకు వచ్చాడు. బుధవారం త్రినాథబోయికి ఛాతిలో నొప్పి వస్తుండటంతో ఆటోలో బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గురువారం బంధువుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

హన్వాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మహమ్మదాబాద్ మండలం షేక్‌పల్లికి చెందిన సందీప్ (20) బైక్‌పై కోయిల్‌కొండలోని బంధువుల ఇంటికి బయలుదేరాడు. మండలంలోని హనుమాన్ టెంపుల్‌తండా సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వచ్చిన ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే 108 వాహనంలో జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి అటు నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. తల్లి సుభద్రమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వరప్రదాయిని కోయిల్‌సాగర్


కోయిల్‌సాగర్ జలాశయం

వేసవిలో ప్రాజెక్టు నుంచి తాగునీటి సరఫరా

- ప్రస్తుతం 13.3 అడుగుల నీటిమట్టం
- 340 గ్రామాలకు.. నాలుగు నెలల పాటు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ జలాశయాన్ని తాగునీటి అవసరాలకు వినియోగించుకోవడానికి మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ అధికారులు సిద్ధమయ్యారు. వానాకాలం, యాసంగి పంటలకు సాగునీటిని అందించిన ప్రాజెక్టు ఇప్పుడు 340 గ్రామాల ప్రజలకు నాలుగు నెలల పాటు తాగునీటిని అందించనుంది. ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న మూడు పంప్‌హౌజ్‌ల నుంచి రోజు తాగునీటిని సరఫరా చేయనున్నారు. దేవరకద్ర వైపు ఉన్న పంప్‌హౌజ్ నుంచి మహబూబ్‌నగర్, దేవరకద్ర, మరికల్, ధన్వాడ, నారాయణపేట, మక్తల్ మండలాలకు.. కోయిల్‌కొండ వైపు


పాలమూరుకు నీటిని సరఫరా చేసే పంప్‌హౌజ్

ఉన్న రెండు పంప్‌హౌజ్‌ల నుంచి కొడంగల్, కోస్గి, కోయిలకొండ తదితర ప్రాంతాలకు తాగునీటిని అందించనున్నారు. ఏడాది మొత్తం శ్రీశైలం నుంచి వచ్చే కృష్ణా జలాలను మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేస్తుండగా.. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తినప్పుడు కోయిల్‌సాగర్‌ను ఉపయోగించుకుంటారు.

వానాకాలం సీజన్‌లో..

2.27 టీఎంసీల సామర్థ్యం ఉన్న కోయిల్‌సాగర్ జలాశయం నుంచి వానాకాలం సీజన్‌లో సుమారు 35 వేల ఎకరాల పైచిలుకు విస్తీర్ణానికి సాగునీటిని అందించారు. వానాకాలంలో ప్రాజెక్టులోకి వస్తున్న నీటికి సమానంగా కాల్వలకు మూడునెలల పాటు నిరంతరంగా నీటిని వదలడంతో ఇది సాధ్యమైంది. అలాగే గొలుసు కట్టు చెరువులను కూడా నింపడానికి ప్రాజెక్టు ఉపయోగపడింది. ఇక జూరాల నుంచి ఎత్తిపోతల ద్వారా వచ్చే నీటిని లింక్ కెనాల్స్ ద్వారా పంటలకు వదలడంతో సాగు విస్తీర్ణం పెరగడానికి ఉపయోగపడింది. ఇక యాసంగిలో ప్రాజెక్టులోని నిల్వ నీటిని విడతల వారీగా పంటలకు వదలడంతో నీటిమట్టం 13.3 అడుగులకు పడిపోయింది. యాసంగి సీజన్‌లో పాత ఆయకట్టు కింద ఉన్న 12 వేల ఎకరాలకు సాగునీరు అందించారు.

> **తాగునీటికి 0.28 టీఎంసీలు..**
>
> 
>
> ప్రాజెక్టులోని సగం నీరు నాలుగు నెలల పాటు 340 గ్రామాలకు సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రస్తుతం ప్రాజెక్టులో 13.3 అడుగులు అంటే 0.55 టీఎంసీలు ఉంది. ఇందులో 0.27 టీఎంసీల నీటిని చేపల కోసం ప్రాజెక్టులో నిల్వ చేసి మిగతా 0.28 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తాం. రోజు పంపుల ద్వారా ఏ మేరకు నీటిని సరఫరా చేస్తున్నామని లెక్కించి నాలుగు నెలల పాటు తాగునీటిని అందించేందుకు నిర్ణయించాం.
>
> – ప్రతాప్‌సింగ్, ఈఈ, కోయిల్‌సాగర్ జలాశయం

పనులు త్వరగా పూర్తి చేయాలి


జోగుళాంబ హాల్ట్ వద్ద రైల్వే పనులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్, రైల్వే అధికారులు

జోగుళాంబ హాల్ట్‌ను పరిశీలించిన జీఎం అరుణ్‌కుమార్ జైన్

ఉండవెల్లి: జోగుళాంబ రైల్వే హాల్ట్ నిర్మాణ పనులను గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు పాటించాలని కాంట్రాక్టర్, అధికారులకు సూచించారు. హై లెవల్ ప్లాట్‌ఫాం, విశ్రాంతి గదుల నిర్మాణాలు, ఆలయ ఆకృతిలో ఉన్న పలురకాల డిజైన్ల గురించి అధికారులతో చర్చించి నమూనాలను పరిశీలించారు. టికెట్ బుకింగ్ కౌంటర్ గదులు, మాస్టర్ ప్లాన్ నమూనా, పార్కింగ్ స్థలాలను చూశారు. జోగుళాంబ హాల్ట్ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరుకావడంతో పనులు చివరి దశకు చేరినట్లు కాంట్రాక్టర్ బీవీఎస్ రెడ్డి తెలిపారు. జూన్ చివరిలోపు పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయనున్నట్లు వివరించారు. ఆయన వెంట రైల్వే అధికారులు ఉన్నారు.

గద్వాల రైల్వేస్టేషన్‌లో..

గద్వాల: జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతగా చేపట్టాలని సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అమృత్ భారత్ పథకంలో భాగంగా స్టేషన్‌లో కొనసాగుతున్న పనులను పరిశీలించారు.

హనుమకొండ ఆర్ట్స్ కాలేజీలో పాలమూరు సాహితీవేత్తలు



ఆర్ట్స్ కళాశాల ఎదుట సాహితీవేత్తలు

కేయూ క్యాంపస్: మహబూబ్‌నగర్ పాలమూరు జిల్లాకు చెందిన 22 మంది తెలుగు సాహితీవేత్తలు గురువారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీని సందర్శించారు. వరంగల్‌లోని ప్రముఖ సాహిత్యకారుల జన్మస్థలాలు, నివాసస్థలాల సందర్శనలో భాగంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ మొదటి ప్రిన్సిపాల్, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య రాయపోలు సుబ్బారావు పనిచేసిన చోటును సందర్శించినట్లు వారు తెలిపారు. సాహిత్యకారుల వెంట కళాశాల మాజీ ప్రిన్సిపాల్, రిటైర్డ్ ఆచార్యులు బన్న అయిలయ్య, సాహితీవేత్తలు రామశాస్త్రి, వీఆర్ విద్యార్థి, ఉన్నారు. ఆర్ట్స్ కాలేజీ గొప్పతనాన్ని బన్న అయిలయ్య వారికి వివరించారు. ఉత్తర తెలంగాణలోనే మొట్టమొదటి విద్యాకేంద్రమైన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 100 సంవత్సరాల చరిత్ర కలిగి ఉందన్నారు. అంతకుముందు పాలమూరు సాహితీవేత్తలకు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గిరిప్రసాద్, డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికుమార్ తదితరులు ఉన్నారు.

చివరి దశకు సహాయక చర్యలు



సొరంగం లోపల కొనసాగుతున్న సహాయక చర్యలు

- నేటితో పూర్తికానున్న శిథిలాల తొలగింపు
- 62 రోజులైనా దొరకని ఆరుగురి ఆచూకీ

అచ్చంపేట: దోమలపెంట ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పైకప్పు కూలిన ప్రదేశంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 62వ రోజు గురువారం డీ2 ప్రదేశం చివరన సహాయక సిబ్బంది శిథిలాలు తొలగించి కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలించారు. నిషేధిత ప్రదేశం అతి సమీపంలో దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది థర్మల్ గ్యాస్‌కట్టర్ సాయంతో టీబీఎం ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించి స్టీల్‌ను లోకో ట్రైన్ ద్వారా సొరంగం బయటకు తీసుకొచ్చారు. మిగిలిన మరో మూడు మీటర్ల శిథిలాల తొలగింపు పనులు శుక్ర, శనివారం ముగుస్తాయని సహాయక సిబ్బంది చెబుతున్నారు. డీ2 ప్రదేశం వరకు శిథిలాలు పూర్తిగా తొలగించినా కార్మికుల జాడ కనిపించలేదు. నిషేధిత 43 మీటర్ల ప్రదేశంలో 30 అడుగుల మేర నిండుకున్న శిథిలాల కింద కార్మికులు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. డీ1 ప్రదేశంలో బలహీనంగా ఉన్న కాంక్రీట్ సెగ్మెంట్లకు సపోర్టుగా సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందం టైగర్ కాక్స్ ఏర్పాటు చేశారు. ఇక్కడ తవ్వకాలు చేపడితే ప్రమాదం జరిగే ప్రమాదం ఉండటంతో నిషేధిత ప్రదేశంగా గుర్తించి కంచె ఏర్పాటు చేశారు. ఆ ప్రదేశంలో శిథిలాలను పూర్తిగా తొలగిస్తే కార్మికుల ఆచూకీ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. 150 హెచ్‌పీ సామర్థ్యం గల 5 భారీ మోటార్లతో నీటి ఊటను కృష్ణానదిలోకి పంపింగ్ చేస్తున్నారు.

డీ1పైనే అందరి దృష్టి..

ఇప్పుడు అందరి దృష్టి నిషేధిత ప్రదేశం డీ1పైనే ఉంది. ఈ ప్రదేశంలో సహాయక చర్యలు కొనసాగిస్తారా! లేక నిలిపివేస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నిషేధిత ప్రదేశం నుంచి సొరంగం తవ్వకాలు చేపట్టడం అంత శ్రేయస్కరం కాదని ఇప్పటికే జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిపుణులు హెచ్చరించిన నేపథ్యంలో సొరంగ మార్గం మళ్లించే అవకాశాలు ఉన్నట్లు సహాయక సిబ్బంది చెబుతున్నారు. అందుకే కంచె ఏర్పాటు చేసిన ప్రదేశం వరకు పూర్తిగా శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంది. తవ్వకాలు కొనసాగిస్తారా లేదా అనే దానిపై రేపటిలోగా స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఆలయ అర్చకుడిపై వేటు

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయ అర్చకుడిపై ఆ శాఖ అధికారులు వేటు వేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయ ఉప ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మపై సస్పెన్షన్ వేటు వేసినట్లు ఆలయ ఈఓ పురేందర్ కుమార్ గురువారం తెలిపారు. శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఉప ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ ర్మపై కొద్ది రోజులుగా పలు ఆరోపణలు వచ్చినట్లు తెలిపారు. ఆ ఆరోపణలపై దేవదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేసినట్లు పేర్కొన్నారు. విచారణ అనంతరం ఆనంద్ శర్మపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంకా విచారణ కొనసాగుతోందని, ఆరోపణల అంశాలను నిర్ణీత సమయంలో వెల్లడిస్తామని తెలిపారు.

క్లినిక్ సీజ్


క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

పాలమూరు: మహబూబ్‌నగర్ రాంమందిర్ చౌరస్తాలో శ్రీరామ్ అనే వ్యక్తి 16 ఏళ్లుగా శ్రీరామ్ క్లినిక్ పేరుతో అక్రమంగా ఆస్పత్రి నడుపుతున్నారు. నిబంధనలు అతిక్రమించి రోగులకు ఇంజక్షన్లు ఇవ్వడం, సెలైన్స్ పెట్టడం, యాంటీబాయిటిక్స్ ఇవ్వడం చేస్తున్నారు. దీంతో గురువారం జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి సీజ్ చేయడంతో పాటు పోలీసు కేసు కూడా నమోదు చేశారు.

108, 102 వాహనాల తనిఖీ


జడ్చర్లలో రికార్డులు పరిశీలిస్తున్న రాష్ట్ర అధికారి గిరీష్‌బాబు

పాలమూరు/జడ్చర్ల: మహబూబ్‌నగర్, జడ్చర్లలోని 108, 102 వాహనాలను గురువారం ఆ శాఖ రాష్ట్ర అధికారి గిరీష్‌బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల్లోని రికార్డులు, పరికరాల పనితీరు, నిర్వహణను పరిశీలించారు. క్షతగాత్రులు, రోగులను ఆస్పత్రులకు తరలించే సమయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, అందిస్తున్న చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన, నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అదే విధంగా 102 అమ్మ ఒడి వాహనాల నిర్వాహకులకు పలు సూచలు చేశారు. గర్భిణులను సకాలంలో ఆస్పత్రులకు తరలించేందుకు సిద్ధంగా, శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నిర్వహణలో ఎక్కడా నిర్లక్షం కనిపించరాదని తెలిపారు. ఆయన వెంట ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్, జిల్లా కో–ఆర్డినేటర్ ఉదయ్ తదితరులు ఉన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

టిఫిన్ సెంటర్లలో నమూనాలు సేకరించి, నోటీసులు జారీ

పాలమూరు: మహబూబ్‌నగర్‌లో రోడ్డు వెంట కొనసాగుతున్న టిఫిన్ సెంటర్లలో గురువారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. పద్మావతికాలనీ, జనరల్ ఆస్పత్రి ఎదుట, న్యూటౌన్ ప్రాంతాల్లో కొనసాగుతున్న టిఫిన్ సెంటర్స్‌లో ఉపయోగిస్తున్న వంట నూనె, ఇతర సామగ్రిని పరిశీలించారు. నూనె సక్రమంగా లేదని.. ఎక్కువసార్లు వినియోగించినట్లు గుర్తించి పారబోశారు. వంట పాత్రలు శుభ్రంగా లేకపోవడంతో పాటు అనుమతి లేకుండా కొనసాగుతున్న రెండింటికి నోటీసులు జారీ చేశారు. మరో దగ్గర నిల్వ చేసిన పిండిని పారబోసి నమూనాలు సేకరించారు.


పిండిని చెత్త బుట్టలో పారబోయిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్

గుర్తుతెలియని ద్రావణం తాగి..

ఏడాదిన్నర చిన్నారి మృతి.. అపస్మారకస్థితిలో మరో బాలుడు...

- అమరచింతలో విషాద ఘటన


ఆర్తిక (ఫైల్)

అమరచింత: అప్పటి వరకు ఇంటి ముంగిట సరదాగా ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు గుర్తుతెలియని ద్రావణం తాగి ఒకరు హఠాత్తుగా మృతిచెందగా.. మరో బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన గురువారం పట్టణంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన తెలుగు వంశీ, గాయత్రి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి మూడేళ్ల వయసున్న మణికంఠ, ఏడాదిన్నర వయసున్న ఆర్తిక సంతానం. వీరిద్దరూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదే క్రమంలో గురువారం తమ ఇంటి మట్టి మిద్దెపై కుటుంబ సభ్యులతో కలిసి చౌడు వేస్తున్నారు. చిన్నారులు ఇద్దరూ ఇంటి బయట ఆడుకుంటూ రోడ్డుపై పారవేసిన సీసాను చేతితో తీసుకుని మూత తెరిచి అందులోని ద్రావణం తాగారు. కాసేపటికి ఆర్తిక నోటి నుంచి నురుగులు రావడంతో కంగారుపడ్డ తల్లిదండ్రులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు మణికంఠకు మాటలు రాకపోవడంతో ఏం తాగారో తెలియదని, అబ్బాయి శరీరంపై బొబ్బలు వస్తుండటంతో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటనలతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటగా.. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేకాట స్థావరంపై దాడి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాంలాల్

మక్తల్: పేకాట స్థావరంపై దాడి చేసిన ఘటనలో 12 మంది పేకాట రాయుళ్లను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని మంతన్‌గోడ్– కాట్రివ్‌పల్లి గ్రామ శివారులో గురువారం పేకాట ఆడుతున్నారన్నా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేయగా 12 మందిని పట్టుకొని వారి వద్ద రూ.31,900 నగదు, 12 సెల్‌ఫోన్లు, మూడు బైకులు, పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు మక్తల్ సీఐ రాంలాల్ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మల్లమ్మకుంట మర్చిపోవాల్సిందేనా?

- రిజర్వాయర్ రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు లేఖ రాసిన ఎంపీ
- నీటిపారుదలశాఖ అధికారులకు సిఫారస్ చేసిన కలెక్టర్
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న కలెక్టర్ లేఖ
- ఎంపీ తీరుపై సొంత పార్టీ నేతల నుంచి విమర్శలు

శాంతినగర్: మల్లమ్మకుంట రిజర్వాయర్‌పై మళ్లీ రగడ మొదలైంది. అధికార పార్టీ ఎంపీ మల్లు రవి రిజర్వాయర్‌ను రద్దు చేయాలంటూ కలెక్టర్‌కు సూచించడంతో ఆశలు నిరాశలయ్యే అవకాశాలు లేకపోలేదు. మల్లమ్మకుంట రిజర్వాయర్ రద్దు చేయాలంటూ కలెక్టర్ నీటి పారుదలశాఖ అధికారులకు రాసిన లేఖ గురువారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్డీఎస్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందించి రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తుమ్మిళ్ల లిఫ్ట్‌తో పాటు వడ్డేపల్లి మండలం తనగల సమీపంలో మల్లమ్మకుంట, జూలకల్ సమీపంలో రిజర్వాయర్, ఇటిక్యాల మండలం వల్లూరు సమీపంలో రిజర్వాయర్ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.783 కోట్లు అవసరమని జీఓ పాస్ చేసింది. అందులో భాగంగా మొదటి విడతలో రూ.162 కోట్లతో తుమ్మిళ్ల ఎత్తిపోతలను నిర్మించి ఆర్డీఎస్‌కు అనుసంధానం చేసి తనగల వద్ద నీటిని పంపింగ్ చేస్తూ కొంత మేర సాగునీటి సమస్య తీర్చగలిగారు. రెండో దశలో మూడు రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టాలని రైతుల నుంచి డిమాండ్ రావడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి ముందుకొచ్చి గతేడాది సర్వే పనులు చేపట్టారు. అప్పట్లో తనగల రైతులు సర్వే అధికారులను అడ్డుకొని నష్ట పరిహారం ఎక్కువ ఇవ్వాలని లేదంటే వేరే చోట భూమి ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారికి సర్దిచెప్పి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు చేపట్టారు. పనులు ప్రారంభిస్తారని ఎదురుచూస్తున్న తరుణంలో గురువారం కలెక్టర్ నీటిపారుదలశాఖ అధికారులకు రాసిన లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో ఆయకట్టు రైతులనుంచే గాక సొంతపార్టీ నాయకుల నుంచి ఎంపీ తీరుపై విమర్శలు వెల్లువెత్తాయి. 250 మంది దళిత రైతులు 567 ఎకరాల భూమి కోల్పోతారని.. 100 గ్రామాల రైతులు, వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే మల్లమ్మకుంట రిజర్వాయర్‌ను రద్దు చేయాలని ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇది ప్రభుత్వం చేతగానితనమే అంటూ పెదవి విరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మల్లమ్మకుంట రిజర్వాయర్ రద్దు విషయమై పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలని అలంపూర్ నియోజకవర్గ రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.


నీటిపారుదలశాఖ అధికారులకు కలెక్టర్ పంపిన లేఖ